క్లుప్తంగా

రైతుల కోసమే పీఏసీఎస్‌ల సేవలు



రైతులకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: రైతుల శ్రేయస్సు కోసమే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు సేవలను అందిస్తున్నాయని కోటబొమ్మాళి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బాడాన మురళీధర్ అన్నారు. మండల పరిధిలోని పలువురు రైతులకు సుమారు రూ.8 లక్షల ఎస్టీసీసీ రుణాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధి కోసం రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో ఎం.సత్యనారాయణ, డీసీసీబీ మేనేజర్ ఎస్.ఉషాశాంతి, స్థానిక నాయకులు జి.నాగభూషణరావు, బి.గణపతిస్వామి, ఎస్.జనార్ధనరావు, బి.శ్రీనివాస్, టి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీపీ దాస్

సోంపేట: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండలంలోని బెంకిలి పంచాయతీలో శిథిలావస్థలో ఉన్న సామాజిక భవనాన్ని ఎంపీపీ నిధులతో తొలగించి, నూతన భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి దిశలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో చింత ప్రకాష్, సింహాచలం పాడి, మద్దు లోకనాథం, కోటరాజు, తామాడ చంద్రశేఖర్, సాహుకారి జానీ తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి చర్యలు

పలాస: మండలంలోని నీలావతి గ్రామంలో ఉన్న చింతలనాయుడు చెరువు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆ గ్రామ సర్పంచ్ సాౖర తిరుపతిరావు తెలియజేశారు. గ్రామంలోని చెరువు వద్దకు గురువారం వెళ్లి పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించారు. మొత్తం చెరువు విస్తీర్ణంలో ఉపాధి హామీ పనుల కింద అభివృద్ధి చేయిస్తామని పేర్కొన్నారు. ఆయనతో పాటు గ్రామ సచివాలయం ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

కుక్కల బెడదకు పుల్‌స్టాప్



ప్రత్యేక వాహనంలో కుక్కలను తరలిస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో వీధి కుక్కల బెడదకు పుల్‌స్టాప్ పెడుతున్నారు. ఇటీవల కాలంలో పంచాయతీలో అధికంగా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దీంతో వీధి కుక్కలను పట్టుకునేందుకు కాకినాడ నుంచి ప్రత్యేక బృందం వచ్చింది. వీరు వీధుల్లో కుక్కలను పట్టుకొని రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాల్లో విడిచిపెడుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామం చాకలివీధికి చెందిన కోట్ని వాసు అనే పక్షవాత బాధితుడికి దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించారు. మంచానికే పరిమితమైన ఆయనకు బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్ రూ.17,100 నగదును మందుల కోసం గురువారం అందించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న నాడు–నేడు పనుల్లో పూర్తిస్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ సూచించారు. నందిగాం మండలం లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండో దశ నాడు–నేడు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఆమెతో పాటు ఎంఈవో హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు, ఇంజినీరింగ్ సహాయకుడు వంశీ, వెల్ఫేర్ సహాయకుడు తిరుపతిరావు, పాఠశాల కమిటీ చైర్మన్ పి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సురేఖా పాణిగ్రాహికి భరోసాగా..

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన శ్రీకాకుళం సాయుధ రైతాంగ గిరిజన పోరాటంలో అమరులైనటువంటి కామ్రేడ్ సుబ్బారాణి పాణిగ్రాహీ సతీమణి సురేఖా పాణిగ్రాహికి టెక్నికల్ సమస్యతో ఇటీవల పింఛన్ తాత్కాలికంగా నిలిచిపోయింది. దీంతో పింఛన్ పునరుద్ధరణ అయ్యేవరకు ఆమెకు పలువురు భరోసాగా నిలుస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు వ్యక్తులు నెలకు రూ.1000 ఇచ్చేందుకు ముందుకురాగా, తాజాగా పోతనపల్లి తాతారావు సైతం రూ.1000 నగదు గురువారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ తామాడ మధన్, ఎంపీటీసీ మద్దిల పాపారావు, తామాడ సుమన్, నాయనోరు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్తున్నాం

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- పలు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం



టెక్కలి: మంచినీటి సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: నాలుగేళ్లుగా నిష్పక్షపాతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, అందుకే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్తున్నామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామ సచివాలయం పరిధి ఊడికలపాడు, దుర్గంపేట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ కుటుంబాన్ని పలకరిస్తూ ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో పారదర్శకంగా పాలన అందజేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని, తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ బి.మురళీధర్, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, జేసీఎస్ ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, నాయకులు డి.రామకృష్ణారెడ్డి, ఎన్.సత్యరాజ్, ఎన్.అప్పలస్వామి, బి.అప్పన్న, ఎన్.సురేష్, కె.లక్ష్మణ్, ఎ.కల్యాణి, బి.శ్రీనివాస్, ఎస్.జనార్ధన్, గణపతిరావు, కె.సంజీవరావు, ఆర్.లక్ష్మణ్, కె.గోవింద్ పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

సంతబొమ్మాళి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని వడ్డితాండ్ర సంత మైదానంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, గ్రామస్తులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి వివిధ సంక్షేమ పథకాలు ద్వారా ఇప్పటివరకు రూ.1,026 కోట్లు ప్రజలకు అందించామని తెలియజేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎంత మేలు జరిగిందో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వివరిస్తున్నామని వెల్లడించారు. టెక్కలి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో విజయం సాధించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంత రెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, మండల సచివాలయ కన్వీనర్ ఎం.భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిలక రవికుమార్‌రెడ్డి, కె.సతీష్, ఎన్.భీమారావు, పి.రామకృష్ణ, ఎం.అప్పారావు, ఎన్ని మన్మథరావు, మార్పు నాగభూషణరావు, కోట ఇందిర పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ రాజశేఖరరెడ్డి తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి గ్రామానికి చెందిన చల్లా పుష్ప ఇటీవల ఆకస్మికంగా మృతి చెందింది. దీంతో ఆ కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి చేతులమీదుగా గురువారం అందించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మల్లేష్, బుగత రాము, మహిళా పోలీసు భారతి రౌళో తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకూ..



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: ప్రజా సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించడం కోసమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పట్టణంలోని సచివాలయం–2 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ పాడుగు కామేష్, పార్టీ నాయకులు తోట ఢిల్లీరావు, బీన ఢిల్లీరావు, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

మందస: వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మండలంలోని చీపి పంచాయతీ బొందికరి గ్రామంలో వీవో, ఓబీలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సంఘం స్థాయిలో ప్రతీ వీవోఏ, చిన్న సంఘాలు తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించాలన్నారు. సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, టీఎస్పీ రికవరీ శాతశాతం జరిగేలా చేయించాలన్నారు. సమావేశాల్లో ఐబీ, లైవ్లీహుడ్స్, సామాజిక అంశాలపై అజెండా రాసుకుని చర్చించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ కిషోర్, వీవోఏ దేవి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి



అదనపు గదుల నిర్మాణాలను ప్రారంభిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పీఎంపురం ఉన్నత పాఠశాలలో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు గొరకల విశ్వనాథం ఆధ్వర్యంలో గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులు బలోపేతం చేయాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో తులసీరావు, సచివాలయ కన్వీనర్ గొరకల రామారావు, హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ బత్తిని భాస్కరరావు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



ప్రసవం అనంతరం బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సిబ్బంది

టెక్కలి: నందిగాం మండలం పెద్దతామరాపల్లి గ్రామానికి చెందిన పి.నీరజ అనే గర్భిణి గురువారం వేకువజామున 108 వాహనంలో ప్రసవించారు. గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతున్నట్లు టెక్కలి 108 సిబ్బందికి సమాచారం వచ్చింది. దీంతో ఈఎంటీ సింహాచలం, పైలట్ శశిభూషణరావులు వాహనంతో పెద్దతామరాపల్లి చేరుకున్నారు. నీరజను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో, సిబ్బంది ప్రాథమిక వైద్యాన్ని అందజేసి ప్రసవం చేయించారు. దీంతో ఆయా కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



బొమ్మలు గీస్తున్న చిన్నారులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గత కొన్నిరోజులుగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఉదయం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎస్‌రావు, హేమంత్, దుర్గలు హాజరై విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి వై, బందావు శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం సందడి వాతావరణం నెలకొంది. గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులను బృందాలుగా విభజించి ఖో–ఖో ఆడించారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు బి.జయకుమార్, గ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై మినీ ట్రాక్టర్ అందజేత

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు సచివాలయం పరిధిలో ఉన్నటువంటి అన్నదాత రైతు సంఘానికి వైఎస్సార్ యంత్రసేవా కేంద్రం ఆధ్వర్యంలో మినీ ట్రాక్టర్, రోటావేటర్‌ను గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన తామాడ సన్యాసిరావు, పోతనపల్లి పురుషోత్తం, మద్దిల భానుమతి, తామాడ సింహాద్రి, మద్దిల అప్పన్నలు సంఘంగా ఏర్పడ్డారు. వారికి రూ.5 లక్షల వరకు బ్యాంకు రుణ సదుపాయం కల్పించగా, రూ.1.80 లక్షల సబ్సిడీ ప్రభుత్వం తరఫున అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ మద్దిల పాపారావు, ఏఈవో పాపారావు, హార్టికల్చర్ అసిస్టెంట్ పావని, బుడత ధనరాజు పాల్గొన్నారు.

లోఓల్టేజీతో అవస్థలు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని పలు వీధుల్లో లోఓల్టేజీ సమస్యతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. స్థానిక వేంకటేశ్వర కాలనీ, ఎన్టీఆర్ కాలనీతో పాటు మరికొన్ని వీధుల్లో లోఓల్టేజీ సమస్య వేధిస్తుండడంతో, రాత్రి సమయంలో అవస్థలు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. అసలే ఎండలు అత్యధికంగా ఉండడంతో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్‌గా వంశీ



కవిటి: మండల గ్రామీణ నీటి సరఫరా శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌గా బి.వంశీని నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన కవిటి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇన్‌ఛార్జి ఎంపీడీవో శివాజీపాణిగ్రాహి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో పనిచేస్తూ, దీర్ఘకాలిక సెలవు అనంతరం ఏఈ వంశీకి కవిటి మండలానికి పోస్టింగ్ ఇస్తూ సంబంధిత శాఖ అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ఆదిఆంధ్రా వీధి సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ ఎస్.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గడప గడపకూ మన ప్రభుత్వం నేడు

మందస: మండలంలోని గిరిజన ప్రాంతమైన చీపి పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటలకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరుగుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు.

ప్రవేశాలకు దరఖాస్తులు

కవిటి: మండలంలోని రాజపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

స్నాతకోత్సవానికి ఆహ్వానం



ఆహ్వానం అందుకుంటున్న లక్ష్మణ్

మందస: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేం నియోజకవర్గంలోని వెంకటరామన్నగూడేంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి పాలకమండలి సభ్యుడు బత్తిని లక్ష్మణ్‌కు గురువారం ఆహ్వానం అందింది. మండలంలోని భేతాళపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బత్తిని లక్ష్మణ్‌కు, ఈ మేరకు ఆమదాలవలస మండలంలోని పెద్దపేటలో ఉన్న ఉద్యానవన పరిశోధన కేంద్రం నుంచి టెక్నీషియన్ మనోహర్ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ అధ్యక్షతన ఈనెల 12న 5వ స్నాతకోత్సవం జరుగుతుందన్నారు.

సమీకృత వ్యవసాయంతో ఆదాయం

వజ్రపుకొత్తూరు: సమీకృత వ్యవసాయంతో ప్రతి కుటుంబానికీ ఏడాది పొడవునా ఆదాయం సమకూరేలా ప్రణాళికలు రూపొందించాలని వెలుగు ఏపీఎం కె.జాంభవతి సూచించారు. మండలంలోని కొమరల్తాడ గ్రామంలో రైతు సంఘం లీడర్లు, సభ్యులతో సమీకృత వ్యవసాయంపై శిక్షణ, అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. సమీకృత వ్యవసాయ క్లస్టర్‌లో 250 నుంచి 300 కుటుంబాలు ఉండేలా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీసీ హైమావతి, వీవోఏ కొంకి మోహిని, సేవా సమితి సభ్యులు మండల మహేష్, చింత మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం



పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని శాసనాం, గోకర్ణపురం, జలంత్రకోట, బూరగాం రైతులకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పైడిగాం ఛానల్‌లో పూడిక తీత పనులను గోకర్ణపురం, శాసనాం గ్రామాల వద్ద గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఛానల్ పూడిక నిండిపోవడంతో అరకొర నీటితో రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. దీంతో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పిరియా సాయిరాజ్‌లు ప్రత్యేక దృష్టి సారించగా నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక పనులు చేపట్టడం వలన కాలువకు పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోకర్ణపురం, శాసనాం గ్రామాల సర్పంచ్‌లు యారడి ఆనందరావు, గుడ్డిపత్ర వేణు, ఎంపీటీసీ సభ్యుడు దుర్గాసి మాధవరావు, మర్ల జేజేరావు, ఏపీవో జి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ప్రభుత్వ పథకాలు

కంచిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పక్కాగా అందజేయాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన కంచిలి–1, 2 సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. త్వరలో ఈ రెండు సచివాలయాల పరిధిలో నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కార్యాచరణ సిద్ధం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.